# పుణ్యానికి పోతే...

"నా కొద్దు — ఛస్తే చేసుకోని పెళ్ళి." ఓ పక్క కన్నీళ్ళు కారుస్తూనే ఖండితంగా చెప్పింది కమల. చెవినున్న రింగులు ... అన్నట్టు ఊగిసలాడాయి.

"వా తల్లివి కదూ, గట్టిగా అరవకే, మీ నాన్న వింటే మనిద్దరి గొంతులు నొక్కేస్తారూ. అయినా ఇంతదాకా వచ్చేక వద్దంటే ఎలాగో చెప్పమ్మా, పరువే మన్నా దక్కాలా? వద్దా?" కూతురుకి అతి ప్రశాంతంగా నచ్చచెప్పాలని చూసింది జానకమ్మ. వీళ్ళు వచ్చే ముందు కుళాయి గొట్టంలా కన్నుమంది కమల.

"అసలు ఇందాకా ఎవరు తెమ్మన్నారు? పెళ్ళి చూపులప్పుడే చెప్పాను నీకు, నాకతను నచ్చలేదూ అని. ఊరుకున్నట్టే ఊరుకుని మళ్ళీ పెళ్ళి తాంబూలాలు గూడా పుచ్చుకురమ్మని ఎవరు చెప్పారు? నాకు తెలియకుండా అంతా చేసేసి తీరా ఇందాకా వచ్చాక ఎట్లా అంటావే?" అంత దుఃఖంలోను తల్లిని దెప్పిపొడిచింది కమల. "ఇది మరీ బాగుందమ్మా, అంతా చేసేది మీ నాన్నామూ, మీ ఏడుపులూ సాధింపులూ పడేది నేనూను." కొంచెం విస్మారంగా అని మళ్ళీ సమాధాన పరిచే ధోరణిలో, "నేనుమాత్రం నీ కిష్టంలేని పెళ్ళి చెయ్యమంటానుటే? 'అది నా కిష్టంలేదంటూంది. ఆ సంబంధం వదిలెయ్య'మని చెవి నిల్లు కట్టుకుని పోరాను. మీ మావయ్య చేతా చెప్పించాను. నువ్వూ విన్నావుగా . . . ఇక నేనుమాత్రం ఏం చెయ్యను? వట్టి తిక్కమనిషి. ముభావంగా ఊరుకుంటే ఒప్పుకున్నారనే అనుకున్నాను. తీరా వాళ్ళు ఓ వెయ్యి కట్నం తగ్గిస్తామని ఉత్తరం రాసేసరికల్లా చెప్పాపెట్టాకుండా తాంబూలాలు పుచ్చుకు చక్కా వచ్చారు. ఇకనేనేం చేసేది చెప్పు తల్లీ? అటుచూద్దునా ఆయనగారి అహంభావం 'ఎవరికోసం చేసుకుంటుందీ' అని, ఇటు చూద్దునా నీ ఏడుపులూ శాపనార్థాలూను. మధ్య నాకు వచ్చి పడిందమ్మా చావు!" నుదురు కొట్టుకుంది జానకమ్మ.


"నువ్వెందుకు, నేనే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాలే. ఈ వెధవ పెళ్ళి చేసుకునేకంటే చావడమే నయం"_ రుసరుస ...


"ఛ అవేం మాటలే, ... ఇయ్యా పెళ్ళి తల పెడుతూంటే". కమల పెద్దక్క సీత బిందెతో నీళ్ళు గట్టుమీద పెడుతూ తల్లివంక చూసి "నువ్విక్కడ ఉండేనా అమ్మా, అదిట్లా వాగుతూంటే చూస్తూ ఊరుకున్నావ్?" అంది.

"నన్నేం చెయ్యమన్నావే? అదేమన్నా నా మాట వినేరకమా ఏమన్నానా?" విసుగ్గా అంది జానకమ్మ ఎసట్లో బియ్యంపోసి కలబెడుతూ. తన కన్యాయం జరుగుతూందని తెలిసికూడా అమ్మా అక్కా ఇద్దరూ తన్నే ... రోషం ... వచ్చింది కమలకి. ఏడుపూ ముంచుకువచ్చింది. నిజానికి నీళ్ళకుండ నెత్తిన పెట్టుకొనేరకం కాదు కమల. గోడకి ఆనుకుని కూచున్నదల్లా దురుసుగా ముందుకు వంగి "నేనేం చిన్న పిల్లని కాను మీరు ఆడమన్నట్టల్లా ఆడడానికి. మీమాట విన్నవాళ్ళ బతుకులు ఎలా అఘోరిస్తున్నాయో నేనూ చూస్తున్నాగా. మీ మాట వినబట్టే కట్నంలేదని సీతక్కని మూడోపెళ్ళి ముసలాడికిచ్చి మూడేళ్ళకల్లా ముండమోపినిచేసి ఇంటికి తెచ్చుకున్నారూ. నోరు మెత్తని దనేగా శాంతక్కని తెలివి తక్కువ వాడికిచ్చి కట్టారూ? ఇప్పుడు నాకు గూడా ఓ గుదిబండని కట్టి నేను గూడా వాళ్ళలాగే ఏడుస్తూ కూ...టే చూద్దామని కదూ ... బులపాటం?" వెక్కుతూ అంది కమల. "...వ్వ, అవ్వ. నోరు మూసుకోవే — ఎవరన్నా వింటే నవ్వగలరూ. అయినా నిన్నని లాభమేమిటిలే! నిన్నిట్లా తయారుచేసిన నీ మామ సనాలిగాని"_ నోరునొక్కుకుంటూ గదిమింది జానకమ్మ. "అవునులే, నన్నూ, మావయ్యని ఆడి పోసుకోటం కంటే నువ్వేం చెయ్యగలవులే?" నేల తాటించుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది కమల.

ఎండ చిటపటలాడుతూంది. వంటింట్లో కుంపటి మీద పొంగిన పాలు పొయ్యిపాలవుతున్నాయి. వెడుతున్న కూతురువంకే చూస్తూ "చూశావుటే? ఇదీ వరస!" తల వంచుకుని కూర తరుగుతున్న సీతతో అంది జానకమ్మ.

"అదిమాత్రం ఏ మందమ్మా? ఉన్నమాటే చెప్పింది.






కట్నం తక్కువని చూశాడే తప్ప, నాన్న దాని ఇష్టం కనుక్కొన్నాడా? ఈడువచ్చిన పిల్ల, చదువుకుంది, దాన్నిమాత్రం అడగద్దూ? . . ." అంతదాకా తన పక్షమే అనుకున్న పెద్దకూతురు కూడా అలా అనేసరి కల్లా ఏం చెయ్యాలో తోచలేదు జానకమ్మకి. అయినా బెట్టుసడలకుండా "అయితే మిమ్మల్నిమాత్రం అడిగి చేశాముటే? మీరుగూడా ఇలాగే . . ." ఇంకా ఏదో అనబోయిన తల్లికి అడ్డుపడుతూ "అందుకే మా బతుకులెలా తెల్లారినయ్యో చెప్పిందిగా కమల!" గద్గద కంఠంతో అని తల్లిమొహంలోకి చూసి తల వాల్చేసింది సీత.

"అయితే భగవంతుడుచేసిందానికి గూడా . . ." సరిపెట్టుకుంటూ అనబోయి కూతురు మొహంచూసి మాట తుంచేసింది జానకమ్మ. తన మాటలు తనకే ఎబ్బెట్టనిపించాయి. ఒక్కసారిగా ఆమె కళ్ళు చెమ ర్చాయి. అవును తన బిడ్డలెప్పుడు సుఖపడ్డారు? కలిగిన ఇంటపుట్టినా, కడుపునిండా తిండితప్ప, వాళ్ళ కోరికలు ఏమి తీరాయి? డబ్బుకీ, ప్రాణానికీ లంకె పెట్టుకున్న ఆయన వాళ్ళ సరదాలు ఎప్పుడు ఖాతరు చేశారు? వాళ్ళ సొద విన్న తానుమాత్రం ఏంచెయ్యగలిగింది? ఆయన ఎదుటపడి ఏమన్నా అడగగలిగిందా? అడిగినా ప్రయోజనంలేదని తనకే తెలుసునయ్యె! కాకపోతే, నలుగురూ వింటే కాపరం నవ్వులపాలవుతుందని, తను నోరుమూసుకుని, వాళ్ళ నోళ్ళుకూడా ముయ్యాలని చూస్తూంది. అంతే. కూతుర్ని చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచింది జానకమ్మ.

ఆ రాత్రి కమలకు నిద్రపట్టలేదు. బైట మిణు గురు పురుగులు చీకట్లో వెలుగుల్ని జల్లెడ పడు తున్నాయి. ఈదరగాలి చెట్లని పీక నులిమి చక్కా పోతూంది. పెరట్లో మందార నెత్తురుబొట్లు రాలు స్తూంది. రేపు జరగబోయే ప్రధానం మాట పదే పదే జ్ఞాపకానికి వచ్చి నిద్రపట్టనివ్వలేదు కమలకి. అక్క య్యల జీవితంలాగే తన జీవితంగూడా రాళ్ళపాలవుతుంటే చూస్తూ ఊరుకోవలసిందేనా? దీనికంతటికీ కారణ మయిన తండ్రిని తలుచుకుంటే కోపం రగిలిపోతూంది. ఎంతవరకు ఆస్తి పెంచుదామని తప్ప, 'అది ఎందుకు వినియోగపడుతుందా?' అని మాత్రం చూడడు. ఆయన ఆలోచించేదల్లా, డబ్బుని ఎలా తిప్పితే ఎలా పెరుగుతుందీ అని. ఆయన దృష్టిలో ఆడపిల్ల కింద ఖర్చుపెట్టినంత దండగ ఇంకొకటిలేదు. ఎలాగూ ఇంకోచోటికి తర్లి వెళ్ళేవాళ్ళేగా, అందువల్ల వాళ్ళని ఎంత తక్కువ ఖర్చులో వదలగొట్టుకోగలిగితే అంత మంచిది. అదీ ఆయన అభిప్రాయం. అలా అని, కొడుకు బాగు ఏమన్నా చూశారా అంటే అదీ లేదు.

ఉన్న ఒక్కకొడుకూ థర్డుఫారం ప్యాసైనాడో లేదో, ఆపైన జీతం కట్టవలసి వస్తుందని "వ్యవసాయం చూసుకునేవాడికి పెద్దచదువులెందు"కంటూ మాని పించిన పెద్దమనిషి! డబ్బుని పెంచే విషయంలో ఆయన బుర్ర ఎంత చురుగ్గా పనిచేస్తూందో, ఖర్చు తగ్గించే పనిలోనూ అంతకంటే చురుగ్గా పనిచేస్తుంది. దాని పర్యవసానమే అక్కయ్యల పెళ్ళిళ్ళు. "మూడో పెళ్లి అయితేనేం? ముప్ఫయ్యయిదు ఏళ్లకంటే ఎక్కువ ఉండవు. కాకపోతే పిల్లలున్నారంటావా? వాళ్ళని సాకడానికి వెనకాల ఇంటినిండా బోలెడు బలగం

**పెళ్లి కెదిగిన ఆడపిల్ల పద్మవ్యూహంతో సమానం ... పెళ్లిచేసి, పంపి, తృప్తితో గాలిపీల్చిననాడు, ఆ వ్యూహం నుండి బయటపడ్డట్లే, కానీ ఈలోగా పరువులు, పట్టింపులు, బాంధవ్యాలు, ఎన్నో ఎదురు నిలిచి, బెదిరిస్తాయి. చేసుకునేవారి మనసులు నిష్కల్మషం అయితే, యివన్నీ, గాలికి చెదిరే మబ్బులే అవుతాయి.**

ఉంది — అత్తలూ, ఆడబడుచులూనూ. బోలెడు ఆస్తి, కోరినట్టు, కోరిన నగా, ఆడదాని కింతకంటే ఏంకావాలి?'' అమ్మ పెళ్లికొడుకు మరీ పెద్దవాడని గొణిగినందుకు నాన్న జవాబు. వాళ్లు ప్రధానానికి తెచ్చిన పట్టుచీరా, రాళ్ల నగలూ చూసి, ''పోన్లే, ఇక్కడ తీరకపోయినా అక్కడయినా తీరుతాయి దాని అచ్చట్లూ ముచ్చట్లూను'' అని తను సంతృప్తిపడి, అక్కని సుఖపెడుతున్నాను అనుకుని మెదలకుండ ఊరుకుంది అమ్మ. అనాడు చస్తానని బెదిరించిన అక్కని గదిలోపెట్టి, కాపలాకాసి తంతు జరిపించాడు నాన్న. అక్క కాపరానికి వెళ్లగానే అనుకున్న ముచ్చట్లు ముక్కలవనే అయ్యాయి. వెళ్లగానే, ''ఈ నగలన్నీ నీ సవితివి— అవి దాని కూతురు కివ్వా''లంటూ అవన్నీ తీసి ఇనప్పెట్టెలో పెట్టిందిట దాని అత్తగారు. ఆ తరవాత బయటబడ్డ చిదంబర రహస్యం బావకి గుండె జబ్బని. ఆయన ఆట్టే కదలటానికి వీల్లేదు. మరదులూ, తోడికోడళ్లూ, అత్తా, తలచెడిన ఆడబడుచులూ, తాంబకింద మసిలే ఆ పెద్ద ఇంట్లో ఈ రోగిష్టి మనిషి సేవ చేసేందుకు ఎవ్వరికీ తీరకపోడం మూలాన జీతం, బత్తెంలేకుండా ఊడిగంచేసేందుకు అక్కని చేసుకున్నాడట బావ! అబ్బ, ఆడదంటే ఎంత చులకన! తన రోగిష్టి శరీరంకోసం ఒక జీవితం నాశనమైనా ఫరవాలేదు. ఏనాడో చచ్చి బూడిదైన బావమీద కోపంతో కమల పెదవులు కంపించాయి. అయినా ఆయననను కోవడం దేనికి, కట్నం తప్పుతుంది కదా అని చూస్తూ చూస్తూ కన్నకూతురు గొంతు కోసిన తండ్రిననుకోవాలిగాని! తనమీద ఆధారపడిన రోగిష్టి మనిషి భార్యంటే ఎవరికి లక్ష్యం ఉంటుంది కాబట్టి? ఆ ఇంట్లో మూడేళ్లు జీతం, భత్యంలేని చాకిరీచేసింది అక్క. ఆ తరవాత బావ పోవడం, అక్క తమ ఇంటికి జేరడం, నాన్న మనోవర్తికోసం దావావెయ్యడం తంతు లన్నీ యథావిధిగా జరిగిపోయాయి. వాళ్లు సరేసరి. బావజబ్బుకోసం బోలెడు అప్పులయ్యాయంటూ, మనోవర్తిమాట దేవుడెరుగునుగాని ఎదురు సవితి పిల్లల్ని అంటగట్టాలని చూసేసరికి నాన్న తోక ముడవటంతో సమాప్తమయింది అక్కయ్య కడగళ్ల కాపరం కథ.

ఆ తరవాత శాంతక్కకయినా సరియైన సంబంధం నిచారించి చేశాడా అంటే అదీలేదు. వట్టి చేతకాని

# పలివేటి నాగచంద్రావతి

వాడికిచ్చి కట్టబెట్టాడు కట్నం తక్కువ కదా అని. తెలుసున్న వాళ్లు ''ఇదేమిటండీ అతనికిస్తున్నారూ? చదువూ, సంధ్యా లేదు — ఓ పనీపాటా చెయ్యడు. ఆస్తి చూద్దామా అంటే అంతంతమాత్రమే!'' అంటూ నాన్నకు తెలియకచేస్తున్నాడనుకుని చెప్పబోయారు. నాన్నకు మాటలు చేతకాకపోతే కదూ! ''అతనికేమిటండీ, కాలువంకరా? కన్ను వంకరా? ఆలనా పాలనా లేక అలా ఉన్నాడుగానీ, బాధ్యత నెత్తినపడితే అతనే సంపాదించుకుంటాడు. ఆస్తి అంటారా — ఉన్నది ఒక్కడు, పంచుకోవాలా తెంచుకోవాలా? కసిన్ని నీళ్లు విడుపుతూ పోతే మొక్కే మానవుతుంది'' అన్నాడు. ఇప్పుడు అక్కనిచూస్తే జాలేస్తుంది. దాని పని ''చాదస్తం మొగుడు చెపితే వినడు, కొడితే ఏడుస్తాడు!'' అన్నట్టుంది. అతగాడికి ఓ దమ్మిడీ సంపాదించే చాకచక్యం లేదు. వట్టి భయస్థుడు. దానికి తోడు చిరుతిండి ధ్యాస ఎక్కువ. ఇదే ఏదో తిప్పలుపడి చిన్న కొట్టుపెట్టుకునీ, వడ్డీలకు మార్చుకుంటూనూ, గుట్టుగా సంసారం లాగుతూంటే ''నా కది చేసిపెట్టవ్, ఇది చేసిపెట్టవ్'' అంటూ దీనిమీద నలుసురికీ వినబడేలా ఎగురుతాట్ట గర్భిణీస్త్రీలా. అది గూడా, అమ్మలానే, అందరూ ఎక్కడ నవ్విపోతారో అని నోరు మూసుకుని ఇక్కడికి వచ్చి నాన్న దగ్గిరా అమ్మ దగ్గిరా ఏడ్చి కాస్తో కూస్తో తీసుకువెళ్లి అతగాడి గొంతెమ్మ కోర్కెలన్నీ తీరుస్తూంటుంది. మొన్నటికి మొన్న నాపిల్లల గతేమిటని నాన్నని నిలేసి ఎలాగయితేనేం రెండెకరాలు తనపేర పెట్టించుకుంది. ఈ ఇచ్చేదేదో ముందే కట్నంగా ఇస్తే దానికి వేరే మంచి సంబంధమే వచ్చేది కదా అని అమ్మ లోలోపల అనుకోకుండా ఉండలేకపోయింది. ఎదట అనడానికి ఎన్నిగుండెలుండాలి మరి!

తనకిమాత్రం ఇలాంటి అన్యాయం జరగదని ఎందుకో గట్టిధైర్యం ఉంది కమలకి. ఆ భరవసాకి తగిన కారణం లేకపోలేదు. అందరిలాకాకుండా తన చదువూ, సంధ్యా ఒక మంచి దారిన పడ్డాయి. దానికి మూలం నాన్నకాదు మామయ్య. మావయ్యకి పిల్లలు లేకపోవడం మూలాన తనెప్పుడూ వాళ్ల ఇంట్లోనే ఎక్కువగా మసిలేది. తమ ఊరికి దగ్గిరగానే మావయ్యగారుండే పట్నం ఉండటం మూలాన అక్కడ కొన్నాళ్లూ, ఇక్కడ కొన్నాళ్లూ ఉండేది. తమ ఊళ్లో అయిదో తరగతిదాకా చదువుకున్న తరవాత మావయ్య పట్టుపట్టి వాళ్ల ఊళ్లో ఫస్టుఫారంలో చేర్పించాడు. అప్పటినించీ మావయ్యగారింట్లోనే ఉంటూంది. మళ్లీ థర్డుఫారంతో తన చదువు ఆగిపోయేదే. కాని తనకున్న చదువుమీది ఆసక్తినిచూసి, మావయ్యే పై చదువుకి నాన్నని ఒప్పించాడు. నాన్న ఓపట్టాన ఒప్పుకున్నాడా? ''ఇప్పుడు దీనికెందుకయ్యా ఇంత చదువూ? ఎవడో ఒకణ్ణిచూసి ముడిపెట్టేదానికి? ఇప్పుడది ఏ స్కూల్ ఫైనలో చదివితే, రేపు ఏ బియ్యేనో తెమ్మంటుంది!'' అన్నాడు. అదీ నాన్న భయం! 'ఏమో దాని అదృష్టం బాగుంటే అలాగే వస్తాడేమో' అని అమ్మ ఆశ! ''ఆ. ఆ. వస్తాడు మూటలు గుమ్మరిస్తే సరి''– నాన్న రుసరుసలు. ''అప్పుడే అదంతా ఎందుకు బావా? నువ్వు దాని చదువుకేమన్నా పెట్టాలా పొయ్యాలా? గవర్నమెంటు ధర్మమా అని జీతాలెలాగూ కట్టక్కరలేదమ్మోను ఆడపిల్లలకి. పెటుగాడి పుస్తకాలొక్కటి

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యమునకు · బలమునకు
అమృత
స్త్రీల ఆరోగ్యానికి
బాలప్రాశ
బిడ్డల టానిక్
రక్తశోధక
చర్మవ్యాధులకు
చ్యవనప్రాశన
దగ్గుకు
ఆయుర్వేదాశ్రమం, ప్రైవేటు లిమిటెడ్, మదరాసు-17.
3

ఎలెక్ట్రిక్ అండ్ రేడియో ఇంజనీరింగ్ కోర్సు

ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపెయిరింగ్, ఎస్సెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ సూపర్వయిజరీ, వైరింగ్ వగైరాయొక్క పూర్తిగైడు. (800 చిత్రపటములు.) రు. 12–50 వి.పి. పోస్టేజి రు. 2/-.

**Sulekha Book Depot (E)**
**Aligarh**

మీకు సంతానం లేదా!



స్త్రీ సంజీవి
నెం 2
సంతాననిధి

అమూల్యము, శక్తివంతమునైన మూలికల యోగము. ఆపరేషన్లు చేయించి, విరాశ చెందిన సోదరీమణులు సంతానవతులై యోగ్యతాపత్రము లిచ్చియున్నారు.
వెల: రు. 10/– పోస్టేజి ప్యాకింగ్ అదనం.
**శ్రీ నాగార్జున మూలికా కుటీరం,**
రైల్వేస్టేషను వద్ద, రామాలయం వీధి,
తెనాలి–2.

న్నాడు, అతనే వీరభద్రానికివ్వవలసిన అప్పు విషయ మేదో మాట్లాడ్డానికి వచ్చి అంతా విన్నాడు. ఆ తరవాత కమలకు జరిగిన అన్యాయం వీరభద్రం చెప్పగా విని చాలా విచారించాడు కూడాను. అన్నివిధాలా కమలకు తగ్గవాడనుకున్నాక వీరభద్రం ఓ మంచి రోజు చూసి రామచంద్రాన్ని కలుసుకున్నాడు.

అంతా అతనికి వివరించి చెప్పాక, "కమల ఏ పరిస్థితుల్లో ఇల్లువిడిచి నా ఇంటికి వచ్చిందో ప్రత్యక్షంగా నీకు తెలుసుగదా! అదీ చదువుకుంది, నీకు తగ్గదని, నా అభిప్రాయం, ఏమంటావ్? నీ కిష్టమయితే మీ అమ్మగారిని కలుద్దామని ముందు నిన్నే అడుగుతున్నాను" అని సూటిగా అడిగాడు. అంతా విన్నాక రామచంద్రం అన్నాడు:

"అమ్మాయయితే నాకు నచ్చిందనుకోండి. కాని కట్నం విషయం . . . మీ బావగారు రెండు, మూడు వేలకంటే ఎక్కువియ్యరని విన్నానే?"

"మరి నీకు ఎంతకట్నం కావాలేమిటి?"

నానుస్తూ చెప్పాడు రామచంద్రం. "మా ఇంటిమీదా, పొలంమీదా అప్పున్నమాట మీకు తెలుసునుగా! మా కివ్వాలిసిన ఆరు వేలే కాకుండా, మరో రెండువేల దాకా అప్పులున్నాయి. ఈ ఋణాలన్నిటికీ నాకు వచ్చే కట్నంమీదే ఆశపెట్టుకుంది మా అమ్మ."

"ఎనిమిదివేలా? . . ." ఆలోచనలో పడ్డాడు వీరభద్రం. తన బావ ఎనిమిదివేలైనా ఇవ్వగల స్తోమతు లేనివాడేమీకాదు. కాని రెండు, మూడు వేలకంటే ఎక్కువియ్యని మాట నిజం. అంత తక్కువలో ఇటువంటి సంబంధం కుదరటం కూడా కష్టమే. ఒకటి, రెండు వేలు అటూ ఇటూ అయితే తను పెట్టుకోవచ్చునుకున్నాడు గాని, మొత్తంగా ఎనిమిదివేలు తన సర్వస్వం వదిలేసుకుంటే తప్ప తనివ్వలేడు — మరేమిటి ఉపాయం? చటుక్కున తట్టింది. "చూడు చంద్రం! మా బావ ఎనిమిది వేలు ఇవ్వలేనివాడేమీకాదు. ఆయన లోభిత్వం ఇవ్వనివ్వదంతే. అందుకని నువ్వొక్కపని చేశావంటే..." రామచంద్రం చెయ్యిపట్టుకుంటూ అడిగాడు.

"ఏమిటది?" వీరభద్రంవైపు కుతూహలంగా చూశాడు చంద్రం.

"ఆయన ఇస్తానన్నంత కట్నానికే ఒప్పుకో. ఆ తరవాత . . ." తనకు తట్టిన ఉపాయాన్ని చెప్పాడు వీరభద్రం.

"ఛ ఛ. అదేంపనండీ. . ." అనన్న అతని రెండు చేతులూ పట్టుకొని, "కాదు, చంద్రం, మా బావ మొండితనం కారణంగా కమల జీవితం నాశనమయిపోతూంది. అదిచూస్తూ నేను సహించలేకపోతున్నాను. అన్నీ తెలిసిన నువ్వు ఒప్పుకోకపోవనే నిన్ను నేను ప్రాధేయపడుతున్నాను. దీనికి నువ్వు ఒప్పుకోకతప్పదు" అని దీనంగా అడుగుతున్న అతన్ని కాదనటం ఎట్లాగో తెలియలేదు చంద్రానికి.

"అది సరేననుకోండి. కాని మీ ఎత్తు పారుతుందని నమ్మకమేమిటి? తీరా మీ బావ మొండితనంగా నలుగురిచేతా చెప్పించి తాళికట్టేస్తేనో? అందాకా వచ్చాక నేనూ లేచిపోలేను కదా? అప్పుడు నా సంగతి?"

"తేచి వచ్చెయ్యమని నేనూ అనను. అందాకారాదు. వస్తే, ఆ కుతకాలకి నేను పూచీ ఉంటా సరేనా?"

"అబ్బే, మీకెందుకండీ మధ్య?" అయిష్టంగా అన్నాడు చంద్రం.

"మరేమీ ఫరవాలేదు. అది నా కూతురులాంటిదే. ఇక నువ్వు ఒప్పుకున్నట్టే కదూ?". . . తేలికపడ్డట్టు ఊపిరి తీసుకోబోయాడు వీరభద్రం.

"నేను ఒప్పుకున్నాననుకోండి. కాని మాఅమ్మకూడా సరేనంటే తప్ప . . ." నసుగుతూ నీళ్ళు నమిలాడు చంద్రం, మళ్ళీ కొంత నైరాశ్యం ఆవరించినా సర్దుకుంటూ.

"సరే నువ్వూ నేనూ కలిస్తే ఒప్పించలేకపోతామా, పద వెడదాం" అని కండువా వేసుకుని చంద్రంతో వాళ్ళ ఇంటికి దారితీశాడు వీరభద్రం.

అంతా సావకాశంగా విన్న చంద్రం తల్లి కాంతమ్మగారు ఇది మర్యాదస్థుల లక్షణం కాదన్నది. కుర్రవాళ్ళతం తన్నది. మళ్ళీ మళ్ళీ వీరభద్రం ప్రాధేయపడగా, లింగయ్యగారు ఏమీ ఇవ్వకపోతే మా గతేమిటన్నది. మీ పూచీమీద మాకు నమ్మకమేమిటని తేల్చింది.

దానికి సమాధానంగా వీరభద్రం "పెళ్ళినాడే ఎగ్గొట్టా ఆ ఎనిమిదివేలూ నేను ఇస్తాను. అది జరగనినాడు నేను మీకు ఇంటిమీద పెట్టిన ఆరువేల అప్పూ వదిలేసుకుంటాను. ఆ పత్రాలు మీ దగ్గిరే ఉంచుకోండి" అన్నాడు.

"మరి మిగతా చిల్లర అప్పులు రెండువేలో? అన్ని అప్పులూ తీరితేనే ఆ కాస్త ఆస్తి అయినా వీడికి దక్కుతుందని నా ఆశ. ఇలా పిగ్గడిసి అడుగుతున్నందుకు ఏమీ అనుకోకండి. ఇలాటి విషయాల్లో మొహమాటపడటం, ఆ తరవాత బాధపడడం నా కిష్టంలేక ఇలా అడుగవలసి వస్తూంది" అని కుండ బద్దలు కొట్టింది కాంతమ్మ.

"వాటికి నేను పూచీ రాసిస్తాను. మా బావ కట్నం పూర్తిగా ఇస్తేనే మళ్లీ వాకాయితాలు నా కిమ్మతుగాని" అని హామీ ఇచ్చాక, "మీకెందుకు బాబూ, ఈ అప్పు" అంటూ ముందు కాస్త బెట్టుపోయినా, చివరికి సరేనంది కాంతమ్మ. ఇంకోచోటయితే, ఇంత కట్నం పలకదేమో కూడా మరి.


రామచంద్రంతో అన్ని విషయాలు స్థిరపరచుకున్నాక లింగయ్యగారికి కబురంపాడు వీరభద్రం, ఇక్కడో సంబంధం ఉందంటూ. కబురందగానే భర్తని తొందరచేసి పంపింది జానకమ్మ. ఆమెకిదో పెద్ద దిగులయిపోయింది. పెద్దపిల్లం గతి అట్లా ఉంటే దీని కసలు పెళ్ళే అవదేమోనని బెంగ ఆవిడికి. పైకి భీకరంగానే ఉన్నా, లింగయ్యగారికీ లోపల గుండె పీకుతూనే ఉంది.

ఆపెళ్లితప్పిపోయాకమళ్లీ రెండుమూడుసంబంధాలు చూశాడాయన. క్రియకి వెనకటి సంగతి ఎంత దాచుదామన్నా సాధ్యంకాలేదు. అందువల్ల సంబంధాలు రావటమే కష్టమయిపోయింది. తెలిసీ కేవలం వట్టి కట్నం గుంజుకుపోదానికి వచ్చిన బాపతు కొంతమంది లింగయ్య పిక్కీ పిక్కీ ఇచ్చే కట్నానికి ఒప్పుకోక, "లేచిపోయిన పిల్లకి ఇంత తక్కువలోనే అవుతుందనుకుంటున్నారా పెళ్లి?" అని మొహంమీదే అడిగి చక్కా పోయారు. అథవా వాళ్ళడిగిన కట్నానికి తను తెగించి ఒప్పుకున్నా కమల ఇష్టపడుతుందనేమిటి? తను చూస్తున్న సంబంధాలు దాని కిష్టమయ్యేవి కావని తనకే తెలుస్తూంది! మధ్య దాని గొడవొకటి! అది చేసిన నిర్వాహకానికి అసలు సంబంధం కుదరటమే ఒక సమస్యయితే, దీని ఇష్టం ఒకటా! కమల మీద మహ మంటగా ఉందాయనకి. కనీసం ఆ కోపం తీర్చుకోటానికైనా కమల ఎదురుగా లేదు. ఆయన కుదిర్చే సంబంధం తనకిష్టమయ్యేదాకా మేనమామగారి ఇంట్లోనే ఉంటానని ఖచ్చితంగా చెప్పేసింది కమల. కాళ్ళూ చేతులూ కట్టేసి ఎవడికో ఒకడికి అంటగట్టి అంపకాలు పెట్టేద్దామన్నా అది సాధ్యంకాని పనని తెలుసు కాబట్టే ఎట్లాగో మనసు బిగబట్టి ఊరుకుంటున్నాడు.

'ఈ సంబంధం ఏమవుతుందోలే' అనుకుంటూ వెళ్లిన లింగయ్యగారికి కొండెక్కినట్టే అనిపించింది. బావగారిని కూర్చోబెట్టి కుర్రవాడి సంగతులన్నీ విశదపరిచాడు వీరభద్రం. "అబ్బాయి బి. ఏ. పాసై ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఆస్తి తగినంత ఉంది. కమల కతను బాగా నచ్చాడు. అతనికికూడా కమల నచ్చింది." అన్నీ వింటున్న లింగయ్య "మరి అమ్మాయి సంగతి వాళ్ళకేం తెలియదా?" ఆగలేక అడిగాడు.

"స్పష్టంగా తెలుసు. ఆనాటివేళ కమల ఇక్కడికి వచ్చినప్పుడు అతనిక్కడే ఉన్నాడు. నాకు తెలిసినవాడేలే! ఆవేళ దాని నోటంట అన్నీ విన్నాడు కూడాను. అతనేమ పట్టించుకున్నట్టు లేదు." వివరించాడు వీరభద్రం.

అమ్మయ్య! సగం భారం దిగజారినట్టయింది లింగయ్యగారికి.



చిత్రం—బి. వి. సత్యమూర్తి
(హైదరాబాదు—28)

"మరి కట్నం?"

"అదొక్కటే నువ్వువచ్చి తేల్చాలని ఊరుకున్నాను. ఇదిగో, ఇప్పుడే వాళ్లని పిలిపిస్తాను" అంటూ రామచంద్రానికి కబురంపాడు. కాస్సేపటిలో రామచంద్రం, తల్లీ వచ్చారు.

మామూలు మర్యాదలన్నీ అయ్యాక కట్నకానుకల ప్రసక్తి వచ్చింది. కట్నం పట్టిగ్గా తీసుకోవడం ఇప్పుడు నేరం కాబట్టే అమ్మాయికి పసుపుకుంకాల కింద తన స్తోమతుకు తగ్గట్టు కొంతపొలం పిల్లపేర రాస్తానన్నాడు లింగయ్య. "ఎలా అయితేనేంలే" అనుకుని "సరే" నన్నారు తల్లీ కొడుకులు. ఆ తరవాత తథాస్తు అనుకుంటూ తాంబూలాలు పుచ్చుకున్నారు.

మంగళవాద్యాలు దండిగా మోగుతున్నాయి. పెళ్లి

కూతురు ముస్తాబులో లక్ష్మీదేవి తునకలా మెరుస్తున్న కమల, గౌరీదేవి పూజ చేస్తున్నదన్న మాటేగాని ఆమెలో ఆలోచనలు సుడిగుండాల్లా తిరుగుతున్నాయి. మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది. ఇప్పటిదాకా తానదృష్టవంతురాలే. తను ఊహించుకున్నట్టు, అన్ని విధాలా తనకు తగిన వరుడే లభించబోతున్నాడు. ఇక ముందు జరగబోయే తంతంతా అనుకున్నట్టు జరిగిపోతే తనకు కావలిసింది లేదు.

తనమీద మమకారంకొద్దీ, తన తండ్రి లోభత్వానికి గురికాకుండా తనని కాపాడడంకోసం, మావయ్య చేస్తున్న సాహసానికీ, త్యాగానికీ ఆమె కళ్లు చెమర్చాయి. ఒకవేళ నాన్న మొండికెత్తి తనపేర ఏమీ రాయనంటే? మావయ్యకి జరగబోయే అన్యాయం తలుచుకుంటే గుండె గుభేలుమంటూంది. అలాకాక తన భర్త త్యాగం చేసి మామయ్యది మామయ్య కిచ్చేసినా అప్పుడు తన భర్తకే అన్యాయం జరిగినట్టవుతుంది. అదీ తను సహించలేదు. ఈ రెండు అవాంతరాల్లూ రాకుండా తన తండ్రి మనసే మారేలా చేయమని దేవిని మనసారా ప్రార్థించింది కమల.


కలకలలాడుతున్న వివాహమండపంలోకి మనస్సు కుదుటపరచుకుంటూ నడిచింది. సన్నాయిమేళం అపస్వరాలు పలుకుతున్నాయి చెవిలో. అక్షింతలు మీద పడినప్పుడల్లా ఉలిక్కిపడుతూంది. ఆ సందట్లో పక్కనే తను కోరుకున్న వరుడున్న మురిపెమే చెదిరిపోయింది. జరగవలసిన విధులన్నీ ఒకదానివెంట ఒకటి జరిగిపోతున్నాయి. సూత్రధారణ సమయం వస్తూంది. పురోహితుడు సూత్రంతో అక్షింతలు పంచిపెడుతున్నాడు.

రామచంద్రం చేసైగతో మేనమామని పిలిచి చెవిలో ఏదో గుసగుసలాడి పంపించాడు. ఆయన వెళ్లి, ఏదో హడావిడిగా వెతుకుతున్న లింగయ్యగారితో నెమ్మదిగా,

"మా వండి అన్నగారూ, మీరేదో పొలం అమ్మాయి పేర పెడతానన్నారట. అది ఇప్పుడే తేల్చేసుకుంటే బాగుంటుందంటున్నాడు" అన్నాడు. ఆదరాబాదరాగా వెతుకుతున్నవాడల్లా ఒక క్షణం నిలబడి విని, "దానిదేముందండీ, ముందు అనుకున్నదేగా. ఈ హడావిడి అయిపోనియ్యండి అలాగే రాసేద్దాం!" అంటూ మళ్లీ పనిలో జొరబడబోయిన ఆయన్ని ఆపి "అదేదో మీరే చెప్పివెళ్లండి. అతను ఇప్పుడే రాయాలంటున్నాడు మరి" అన్నాడు.

"సరిసరి. అది ఇప్పుడే అయ్యేపనా ఏమన్నానా? పదండి నే చెబుతా" అంటూ ఆయన వెనకాలే పెళ్లికొడుకు దగ్గిరికి వచ్చి "అదేమిటోయ్ రామచంద్రం! అన్నమాట నేను తప్పుతాననుకున్నావా ఏమిటి? అమ్మాయిపేర అర ఎకరం తప్పకుండా పెడతాను తరవాత. ముందు ఈ తంతు కానీ!" అన్నాడు.

"ఏమిటీ అర ఎకరమా? మూడు నాలుగు ఎకరాలు ఇస్తారని చెప్పాడే అదేమిటి?" ఆశ్చర్యంగా మేనల్లుడి మొహంకేసి చూశాడు రామచంద్రం మేనమామ. ఆయన కలాగే చెప్పాడు రామచంద్రం.




"నాలుగెకరాలే?" నోరు తెరిచేశాడు లింగయ్య.

"అవునండీ మీరేగా మీ స్తోమతుకి తగ్గట్టు పెడతానూ అన్నారు? మీ స్తోమతేంతో నాకు తెలియదా? అందుకనే మూడు నాలుగు ఎకరాలు పెడతారనుకున్నాను. అయినా ఇప్పుడేమంటారు చెప్పండి? ఎంత ఇస్తానంటారూ?"

"వెనక వచ్చిన సంబంధానికి వెయ్యి రూపాయలు ఇస్తానన్నాను. దానికి బదులు అర ఎకరం రాస్తానంటున్నాను కదా!"

"ఇంకేం? ఆ వెనక వచ్చినవాళ్లకే పిల్లనిచ్చుకోలేక పోయారా? నాదాకా ఎందుకు వచ్చారు? అదేం కుదరదు. కనీసం మూడెకరాలన్నా రాయందే నే ఒప్పుకునేది లేదు. ఏదో చప్పున తేల్చి చెప్పండి." నిష్కర్షగా చెప్పాడు రామచంద్రం.

మండిపడ్డాడు లింగయ్య.

"ఏమిటోయ్. బెదిరిస్తున్నావ్? మూడెకరాలంటే ఎంతో తెలుసా?"

"ఎంతయినా కానియ్యండి. అది మీరు నాకేం దానంచెయ్యటం లేదుగా! మీ కూతురి కిచ్చుకుంటున్నారు! అయినా మీరంత ఇవ్వలేనివారాఏమన్నానా?" నిర్లక్ష్యంగా అన్నాడు రామచంద్రం.

"అయితేమాత్రం — ముందు నిక్కచ్చిగా అనుకో లేదు గదా అది ఇంత అన్యాయంగా మాట్లాడతావా? ఊహు నేనుమాత్రం అంతకన్నా ఇచ్చేదిలేదు." 'ఏం చేస్తాడులే!' అన్నట్టు ధీమాగా చూచాడు లింగయ్య.

సూత్రధారణముందు వాద్యాల తమధ్యనాల ముందు ఈ వాగ్వాదం రెట్టింపయింది. "ఆపండయ్యా ఆపం" డన్నా రెవరో. దానితో సద్దు మణిగింది.

"అయితే ఈ పెళ్లి జరగదు!" అంత ఖచ్చితంగానూ అరిచాడు రామచంద్రం. ఒక్కక్షణం నిర్ఘాంతపోయినా, తక్షణమే తేరుకుంటూ "అదెట్లా కాదో నేనూ చూస్తా — ఏడీ ఆ వీరభద్రం?" అంటూ కండువా విసురుగా భుజాన వేసుకుంటూ బావమరిదిని పిలవటానికి వెళ్లాడు లింగయ్య.

ముహూర్తం దాటిపోతుందంటూ హెచ్చరించిన పురోహితుణ్ని "ఆగండి" అని కసిరాడు రామచంద్రం. కమల వెనకాలే ఉన్న జానకమ్మగారి గుండెల్లో రాయి పడింది. ఆవిడ తన పక్కనే ఉన్న రామచంద్రం తల్లి చేతులు పట్టుకుంది. "వదినగారూ! అబ్బాయికి చిన్నతనం. మీరైనా చెప్పండి" అంది దీనంగా.

"మగవాళ్ల వ్యవహారంలో నే నెప్పుడూ జోక్యం చేసుకోనమ్మా." నింపాదిగా తప్పించుకుందావిడ.

పెళ్లికి వచ్చిన వాళ్లలో అప్పుడే సంచలనం బయలుదేరింది. కొందరికి అసలు అర్థంకాకపోతే, కొంతమందికి కొంచెం అర్థమయింది. తలోరకంగానూ ఊహించుకుంటూ గడబిడచేస్తున్నారు. విషయం తెలిసిన కొందరు పెద్దలు చంద్రానికి నచ్చచెబుతూంటే, మరికొందరు లింగయ్యగారినే మెత్తబడమంటున్నారు. ఆయన మాత్రం వీరభద్రాన్ని నిలవేసి, "ఇదేమిటయ్యా, నువ్వేదో నిర్వాహకం చేసి మంచి సంబంధం తెచ్చావనుకుంటూంటే, ఇప్పుడు మూడెకరాలు పిల్లపేర పెట్టమంటాడేమిటి?" అని పెద్ద సంబంధం అయినట్టు మాట్లాడుతున్నాడు లింగయ్య.

"పైగా ఆ మూడెకరాలూ ఇప్పుడు కాయితం

మీద రాసేస్తేనే చేసుకుంటాట్ట. లేకపోతే లేచిపోతా నంటున్నాడు." పక్కవాళ్ళు వంతపాడారు. ఒక్కసారిగా ఆశ్చర్యపోయినట్లు, "ఏమిటేమిటి? లేచిపోతా నంటున్నాడా! పద నే చెబుతా" అంటూ గబగబ చంద్రం దగ్గిరికి వచ్చాడు వీరభద్రం.

"ఏమిటోయ్ చంద్రం! నువ్వేదో తెలిసినవాడివి, నెమ్మదయినవాడివి అనుకుంటూంటే..." అంతలోనే ఆయన్ని మాట్లాడనియ్యకుండానే ఆపి, "చూడండీ మీరు నాకు నలుగురిచేతా చెప్పించో, లేకపోతే బెదిరించో ఈ పెళ్లి జరిగిద్దా మనుకుంటున్నారేమో! అదేం కుదరదు. ఈ పెళ్లి కుదిర్చినప్పుడు ఈ పెద్దలంతా లేరు — నాలుగెకరాలు పెట్టడానికి మీరు ముందే ఒప్పుకున్నారని నే నంటే మీరేం చెయ్యగలరు? నేను కాబట్టి మూడెకరాలతో సంతృప్తి పడతానంటున్నాను. మీ బావగారికి ఉన్న ఆస్తేమిటో, ఆయన స్తోమ తెంతో నాకూ తెలుసు, మెడమీద తలకాయ ఉన్న వాడికల్లా తెలుసు. ముందు వదిలేసుకున్న సంబంధం వాళ్లకి రెండువేలే ఇస్తానని ఉండవచ్చు. కాని ఒకసారి సంబంధం తప్పిపోయిన అమ్మాయికి మళ్లీ ఆ రెండు వేలతోనే పెళ్లవుతుందనుకోవడం దురాశ. ఆయన అలా అనుకుంటే మాత్రం నే నెలా ఒప్పుకుంటాను? ఇప్పటికైనా మించిపోయిందేముందిలెండి. ఒకసంబంధం తప్పిపోతే వచ్చే నష్టానికంటే రెండోది తప్పితే వచ్చేది ఎక్కువకాదు. నేను లేస్తాను" అని లేవబోతున్న చంద్రాన్ని రెండుచేతులతోనూ కూర్చోబెడుతూ,

"నువ్వు తొందరపడకు చంద్రం. మా బావచేత ఆ మూడెకరాలూ కమలపేర పెట్టించే పూచీ నాది. మిగతావని పూర్తి కానియ్యండి శాస్త్రులుగారూ . . ." అని బావగారిని ఇవతలికి లాక్కువచ్చేస్తూ అన్నాడు వీరభద్రం.

"ఏమిటోయ్ గుబగబా ఘాటేస్తున్నావ్, మూడెకరాలా? అంటే ఎనిమిది వేలు! ఏమనుకున్నావో!!" రొప్పుతూ మూదలకించాడు లింగయ్య.

"పోనీబావా, ని ఎనిమిదివేలూ నువ్వానా! ఇప్పుడీ పెళ్లి ఆగిందంటే ఇప్పుడు ఎనిమిది వేలతో పోయేది పన్నెండువేలకి దేకుతుంది ముందు ముందు. నా మాట విని రాసి ఇచ్చెయ్" నచ్చచెబుతూ అన్నాడు వీరభద్రం. కళ్లనీళ్లు పెడుతూ భర్త దగ్గిరికి వచ్చింది జానకమ్మ "దానికన్యాయం చెయ్యకండీ, పాపిష్టి డబ్బుపోతేపోయింది రాసి ఇచ్చెయ్యండి!" అంటూ. అంతలో ఎవరో,

"ఏమండోయ్ లింగయ్యగారూ! పెళ్లికొడుకు మంగళసూత్రం పట్టుకు తయారుగా ఉన్నాడు. మీరు ఆ కాగితం పట్టుకుని అక్షింతలు వెయ్యటానికి రావాలిట" అంటూ వచ్చారు.

రాయక తప్పలేదు లింగయ్యగారికి.

ఆ తరవాత అంతా నింపాదిగా, సలక్షణంగా జరిగిపోయింది. ఉరుములూ, మెరుపులూ, సర్దుకున్నాయి. ఆశీర్వచన వనసలు వాన వెలిసింతరవాత కాలవలో నీళ్లల్లే శ్రావ్యంగా మోగాయి.

కొద్దిరోజుల్లోనే కమల కాపరానికి వెళ్లిపోయింది.

అటు ఇటూ మసుగుడిచిం తరవాత హాయిగా నిద్ర పట్టింది రామచంద్రానికి. బారెడు పొద్దెక్కింతరవాతే లేచి ఒళ్లు విరుచుకున్నాడు. నీరెండ గుమ్మానికివతలా అవతలా తక్కుతో తారుతో లోపలికి జొరబడాలని చూస్తోంది. పెరట్లో మంచుపొగ విరిగి ఎండలో కరిగిపోతూంది. తల్లి వంటింట్లో మజ్జిగ చిలికి వెన్న కుదపలు గిన్నెలో కూడబెడుతూంది.

బీరువాలో కాగితాలు తీస్తున్న రామచంద్రాన్ని పనిచేసుకుంటూనే గమనిస్తున్న తల్లి కాంతమ్మ మెల్లిగా దగ్గిరికి వచ్చింది.

"ఏమిట్రా తీస్తున్నావ్?"

"అవేనమ్మా, మన వీరభద్రంగారి అప్పుకాగితాలు. ఆయనవి ఆయనకి ఇచ్చెయ్యద్దూ?"

బీరువా వెయ్యబోతున్న కొడుకుని ఆపింది కాంతమ్మ.

"అవెందుకూ ఇచ్చెయ్యడం?" తెలియనట్టు అడిగింది కాంతమ్మ.

"మరి? . . ." మాట్లాడబోతున్న కొడుకుని ఆపి, "నువ్వు తీరుస్తావా ఆ అప్పు?" అంది.

"కాకపోతే? . . ముందు మనమనుకున్నదేగా! కమలకిచ్చిన మూడెకరాలూ ఉందిగా! అది అమ్మి అప్పులు తీర్చమని కమల అంటూంది. దానిమీద వచ్చే ఆయువేజుతో తీర్చవచ్చుగా — ఉన్న పొలాన్ని అమ్మడమెందుకూ — ఏమంటావు?"

"అది అమ్మనూ అక్కరలేదు — ఇది తీర్చనూ అక్కరలేదు"— తాపీగా అంది కాంతమ్మ. చాటుగా వింటున్న కమల నిర్ఘాంతపోయింది.

"అదెట్లా?" తల్లిభావం అర్థమవుతున్నా నిర్ధారణ కోసం అడిగాడు చంద్రం.

"నువ్విస్తేమటుకు ఆయనెట్లా తీసుకుంటాడురా!" లౌక్యంగా అంది తల్లి ముసిముసిగా నవ్వుతూ.

"ఆయనది ఆయన తీసుకోవడానికేం?"

"ఆదేవిట్రా కమల పెంపుడు తండ్రేగా వీరభద్రమూ? అది మనం తీర్చాలీ అనుకున్నవాడైతే, అప్పు కాగితాలు మన చేతికెందుకిస్తాడూ?"

"ఒకవేళ అడిగితే?"

"ఎందుకడుగుతాడూ? ముందు అనుకున్నదేగా, నీకేమన్నా కట్నమిస్తేగా? అప్పు కాగితాలు తిరిగి ఇయ్యటానికి? నీకు కట్నం ఇవ్వనే లేదాయెను, కోడలికి పసుపుకుంకం కింద ఇచ్చాడుగాని."

"ఏదయితేనేం?"

"ఉహూ. దేనికదే."

"అంతేనంటావా?" మెత్తబడుతూ నమ్మకం చాలనట్టు నసిగాడు రామచంద్రం. అమ్మ లౌక్యం అప్పటికిగాని అర్థంకాలేదతనికి. చెదిరిన క్రాపు సరిచేసుకుని బియ్యే చదువులో అమరని ప్రజ్ఞ అమ్మ అనుభవంలో ఒంటబట్టించుకున్నాడు.

"కాక? అది సరేగాని అమ్మాయి పేరనున్న పొలం నీ పేర రాయించుకుని రిజిష్టరు చేయించుకో. వియ్యంకుడూ ఒప్పుకున్నాడులే. ఆడవాళ్ల పేర ఆస్తెందుకు?" కొంగుదోపుకుంటూ వెళ్లింది కాంతమ్మ.

గోడమూల సాలెగూట్లో ఈగ గిలగిల కొట్టుకుంది. కాళ్లకింద భూమి కదిలినట్టయింది కమలకి.

జరిగిన నాటకమంతా కాంతమ్మ ద్వారా నిదానంగా తెలుసుకున్న తండ్రే, బావమరిదిమీద ఆక్కస్సుకొద్దీ, వియ్యపురాలికి అలాగ నూరిపోశాడని కమలకు తెలియనే లేదు! ★

సులభవాయిదాల మీద

నెలసరి రు. 15/-ల చెల్లుబడిమీద స్టాండర్డ్ జపాన్‌మాడెల్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్. అఖిల



ప్రపంచం, 3 బాండ్సు, 8 ట్రాన్సిస్టర్సు, డబుల్ స్పీకర్. అన్నిఖర్చులు కలుపుకు అందమైన 69 సం॥పు సర్విస్డై రీతో వెల రు.300,-లు. ప్రతి పల్లెకు, పట్టణానికి పంపవచ్చును. వ్రాయండి.

**TOKYO AGENCIES (WAP)**
**Post Bag 11, New Delhi-1.**

1969 లో మీ అదృష్టము

ఏదైన ఒక పుష్పం పేరును, మీ విరునామాయును వ్రాసిన ఒక పోస్టుకార్డు మాత్రం పంపండి. మీకు వచ్చే 12 నెలలో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను,



బదిలీ, సంతానం, వివాహ సౌఖ్యం మొదలైన వివరములు, దుష్టగ్రహ వీక్షణలకు శాంతివిధానములతో పాటు రు. 1—25 పై. లకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.

**PT. DEV DUTT SHASTRI**
**Raj Jyotshi (A.P.)**
**P.B. No. 36, JULLUNDUR CITY**

